రెండుమూడు జామిచెట్లు; పెద్ద చింతచెట్టు, కొస్త దూరంగా డజను తాడిచెట్లు వాటి మధ్యలో గొడ్లపాక, గడ్డివామి; అవతల పొలం. ఆ రెండిళ్ళకీ మధ్య ఇటికలగోడ అడ్డం, ఒకటి రెండు ఇటికలు ఎవరో వూడదీసి కంతచేశారు ఆ కంతలోంచి "మాయని" చూసేవాడు. ఆమె అతన్ని చూసేది. అసలు పేరేమిటో తెలియదు. అందరూ "మాయ" అని పిలిచేవారు. అప్పుడతని వయస్సు పందొమ్మిది, ఆమెదీ అదే వయస్సు—లేక ఒకేడు చిన్నదేమో.

"మాయ" తల్లి తరచు వాళ్ళింటికి వొస్తూవుండేది-పాలు, పెరుగు, నెయ్యి, తీసుకుని అప్పుడప్పుడు తల్లితో తనూ వొస్తూండేది. మాట్లాడదు; సిగ్గు, భయం—వాటిమీద వొంతెన వేసినట్లు చిరునవ్వు అందమైన పెద్ద కళ్ళు, ఆమె అంతరంగం అంతా ఆ కళ్ళలోనే దర్శనం; వేరే దాపరికం లేదు. మెరుగెట్టిన రాగిలో కొత్తదనం జ్ఞప్తికితెచ్చే శరీర ఛాయ; మధ్య పాపిడి-వొంకీలు లేని సాఫీజుట్టు. నుదుటిమీద మాత్రం వొడ్డున విరిగిన కెరటానికి మల్లే, వొంగిపడిన వెండ్రుకల సముధాయం, గడ్డంపైన వొక నల్లటి మచ్చ.

ఆనాడు నారాయణస్వామి వాటిని పరీక్షగా చూడలేదు, ఆ మచ్చ ఒక్కటి మాత్రం జ్ఞాపకముంది మిగతా శరీరం, అవయవాలూ, వ్యక్తి ఉనికి కొట్టుకునే జీవుడు-ఇవన్నీ అస్పష్టంగా, మేఘం పొరవెనక చందమామలా, క్షణం మెరిసి మాయమౌతాయి యవ్వనంలో అందం చూడలేడు మనిషి; దాన్ని పరామర్శించి అందరి లయని పైకిలాగి, ఊహలో సుస్థిరంగా కూర్చోలేడు. కన్ను, ముక్కు, చెవి చిన్నప్పుడు విడివిడిగా, దేనికది పని చేసి, తన ప్రత్యేక వునికిని ఋజువు చేసుకోవు. ఇంద్రియాలన్నీ మొత్తంగా విజృంభించి శరీరమై, దొరికిన అనుభవాన్ని తనలో కలిపేసుకుంటుంది యవ్వనం. సముద్రగర్భం కోటిగుఱ్ఱాల శక్తితో కదలి, ఒందసి గుఱ్ఱాంను ఒక కెరటంగా పంపేస్తే, ఆ కెరటాలన్నీ ఒడ్డున స్వారీచేసి, ఒక పల్చటి, తెల్లపొరని ఇసుకమీద దిగవిడుస్తాయి. అంతటి శక్తి, ఇసుకలో కరిగిన ఆ నురుగు పొరగా అంతమొందుతుంది—అట్లాగే యువపాశం నడివయస్సుని బంధిస్తుంది.

